సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
మంగళవారం 26-11-2024
సంపుటి: 20 సంచిక: 206
పేజీలు: 4 వెల: రూ.1

## రాజ్యాంగ ధర్మాన్ని గౌరవించట అందరి బాధ్యత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భారత రాజ్యాంగ ధర్మాన్ని గౌరవించటం మనందరి బాధ్యతని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం భారత రాజ్యాంగం 75వ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత, పితామహుడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం రాజ్యాంగ ప్రవేశికను పఠిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఏవో గోపినాథ్, ఆర్ఎస్ఐలు, కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## 20 ఏళ్ల సర్వీస్.. 4సార్లు సస్పెన్షన్..1000 మందికి పైగా మోసం..

# మన్నం సతీష్ ఆల్‌టైమ్ రికార్డ్




- ఉద్యోగాల నుంచి హుద్ హుద్ ఇళ్లవరకు వసూలు
- గ్రీవెన్స్, డీపీవోల్లో నిత్యం ఫిర్యాదులు
- నివేదికలు తొక్కిపెట్టేస్తున్న అధికారులు
- కాళ్లరిగేలా తిరుగుతున్న బాధితులు





ఆయనొక ప్రభుత్వ ఉద్యోగి. భార్య కూడా ప్రభుత్వ ఉపాధ్యాయురాలే. జీతానికి కొదవలేదు. అయ్యగారి గీతానికి కూడా అడ్డూ అదుపు లేదు. ఎందుకంటే.. పని చేస్తున్నది పంచాయతీరాజ్‌లో. వద్దంటేనే డబ్బులు వచ్చిపడిపోతాయి. ఇది చాలదని ఉద్యోగాలిప్పిస్తామని, ఇళ్లు మంజూరు చేయిస్తామని, పదోన్నతులు ఇప్పిస్తామని, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయిస్తామని, ఇలా చెప్పకుంటూపోతే ఆయన కోసం రాయాలంటే ఓ గ్రంథం తయారవుతుంది. నిత్యం గ్రీవెన్స్‌లో ఒక్కరి మీదే ఫిర్యాదంటూ వస్తే అది మన్నం సతీష్‌బాబుదే. జిల్లాలో ఏదో ఒకచోట ఆయన బాధితులు గ్రీవెన్స్‌లో కనిపిస్తుంటారు. ఇతగాడు ఉద్యోగంలో ఉన్న రోజుల కంటే సస్పెండవటం వల్లో, విధులకు హాజరుకాకుండా మోసపోయినవారి నుంచి తప్పించుకోడానికి అజ్ఞాతంలో ఉన్నదే ఎక్కువ. 2014 నుంచి ఈయన మీద వరుసగా ఫిర్యాదులు వస్తున్నా, ఇంకా విధుల్లో ఉండటం, ఇంకా అనేక ప్రాంతాల్లో ప్రజలు మోసపోవడం ఆశ్చర్యం.




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మన్నం సతీష్‌బాబు మందస మండలం లోహరిబంద పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నాడు. తరచూ ఫోన్‌నెంబర్లు మారుస్తూ బాధితులకు చిక్కకుండా ఉద్యోగానికి సెలవు పెట్టి తప్పించుకు తిరుగుతున్నారీయన. ఈ విధంగా సుమారు 15 ఏళ్లుగా బాధితులను మోసం చేస్తునే ఉన్నాడు. కాంట్రాక్ట్ ఉద్యోగిగా 2003లో పంచాయతీ కార్యదర్శిగా విధుల్లో చేరిన సతీష్ జిల్లా కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా చలామణి అవుతూ ఉద్యోగాలను రెగ్యులర్ చేయిస్తానని డబ్బులు వసూలుచేసి సహోద్యోగులను పెద్ద ఎత్తున మోసం చేస్తూ వచ్చాడు. దీన్ని కొన్నేళ్లు భరించిన కాంట్రాక్ట్ ఉద్యోగులంతా సతీష్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి జిల్లా బాధ్యతల నుంచి తప్పించారు. అధికారులను మేనేజ్ చేసిన రాష్ట్ర సంఘం ప్రతినిధిగా అవతారమెత్తి రాష్ట్రస్థాయిలో ఉద్యోగాలిప్పిస్తానంటూ నిరుద్యోగ యువతను మోసం చేయడం ప్రారంభించాడు.

### అధికారుల సహకారం

రెగ్యులర్ ఉద్యోగిగా మారిన తర్వాత కోటబొమ్మాళి మండలం కొత్తపేట కార్యదర్శిగా విధుల్లో చేరిన తర్వాత సతీష్‌ను ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారనే అభియోగాలతో 2014 అక్టోబర్‌లో సస్పెండ్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేశారు. అంతకు ముందు విధుల్లో అలసత్వం వహించిన కారణంగా మెళియాపుట్టిలో కార్యదర్శిగా పనిచేసిన సతీష్‌ను సస్పెండ్ చేశారు. ఆ తర్వాత సరుబుజ్జిలి మండలం మతలబుపేట పంచాయతీ కార్యదర్శిగా పని

- మిగతా 4లో



• ఎడిటోరియల్

# రాబోయేవన్నీ కూటమి రోజులే..!

మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అధికార కూటములే గెలుపొందాయి. మహారాష్ట్రలో బీజేపీ, ఏక్‌నాథ్ షిండేకు చెందిన శివసేన, అజిత్ పవార్‌కు సంబంధించిన ఎన్‌సీపీ మహాయుతి ఫ్రంట్ సాధించిన అనూహ్య విజయం ఆశ్చర్యపరుస్తుంది. 288 స్థానాలున్న మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన సాధారణ మెజార్టీ 145 స్థానాలు కాగా మహాయుతికి 234 స్థానాలొచ్చాయి. కాంగ్రెస్, ఉద్ధవ్ థాకరేకు చెందిన శివసేన, శరద్ పవార్‌కు సంబంధించిన ఎన్‌సీపీ ఫ్రంట్ మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ)కి 48 సీట్లే దక్కాయి. అంచనాలకు మించి ఓట్లు, సీట్లు రావడానికి బీజేపీ సహజసిద్ధంగా ప్రయోగించిన హిందుత్వ కార్డు, అస్తిత్వ రాజకీయాలు ప్రధాన కారణం. కుల, మత, ప్రాంతీయ భావాలను తనకు అనుకూలంగా మల్చుకోవడంలో, ఓట్లను సమీకరించడంలో సక్సెస్ అయిందని ఎన్నికల ఫలితాలను చూస్తే అర్థమవుతుంది. మరాఠా కోటాను తానే తెరమీదకు తెచ్చి, నిరసనగా ఆందోళనలు చేస్తున్న తరగతులను సైతం తన వైపు తిప్పుకుంది. ఉచిత పథకాలొద్దని విపక్షాలకు సుద్దులు వల్లించే బీజేపీ అధికారం కోసం పలు సంక్షేమ పథకాలను ప్రకటించింది. గిరిజన రాష్ట్రం జార్ఖండ్‌లో జేఎంఎం నేతృత్వంలోని కూటమి ఘన విజయం బీజేపీకి మింగుడుపడని వ్యవహారం. రాష్ట్రంలో 81 స్థానాలకు గాను జేఎంఎం ఫ్రంట్ 56 సీట్లు గెలుపొందింది. బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏకి కేవలం 24 సీట్లొచ్చాయి. అవినీతి ఆరోపణల కేసులో జెఎంఎం చీఫ్, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కేంద్ర బీజేపీ సర్కార్ జైలులో పెట్టించింది. సార్వత్రిక ఎన్నికల సమయంలోనే ఆయనను బయటికి రానీయలేదు. బెయిల్ సైతం రాకుండా అడ్డుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో మాత్రమే హేమంత్‌కు బెయిల్ లభించింది. హేమంత్ జైలులో ఉండగా కొన్నాళ్లు సిఎంగా పని చేసిన ఆయన సోదరుడు చెంపయి సోరెన్‌ను బీజేపీ తమలో చేర్చుకున్నా, ప్రధాని మోడీ, ఇతర బీజేపీ పెద్దలు హేమంత్ అవినీతిపరుడంటూ పెడబొబ్బలు పెట్టినా, మత విద్వేషాలు, ఎస్‌టి, నాన్-ఎస్‌టి విద్వేషాలు రెచ్చగొట్టినా ఆ కుట్రలను పటాపంచలు చేసి జేఎంఎం ఫ్రంట్‌కు ప్రజలు ఘన విజయం కట్టబెట్టారు. హేమంత్‌పై బీజేపీ చర్యలన్నీ రాజకీయ కక్షతో కూడుకున్నవని గ్రహించి జేఎంఎం ఫ్రంట్‌కు రెండోసారి పట్టం కట్టి తమ విజ్ఞతను చాటుకున్నారు. హేమంత్ సారథ్యంలోని ప్రభుత్వమే తమ హక్కులను పరిరక్షిస్తుందని ఆదివాసీలు, ఇతరులు సైతం నమ్మారు. జేఎంఎం కూటమి విజయానికి అది ప్రకటించిన, ఇంతకు ముందు అమలుచేసిన సంక్షేమ పథకాలూ కారణమే. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ఫలితాలు పలు హెచ్చరికలతో పాటు మార్గదర్శనమూ కావిస్తున్నాయి. ప్రపంచ ద్రవ్య పెట్టుబడికి, నయా-ఉదారవాద విధానాలకు దేశానికి మహారాష్ట్ర ముఖద్వారం. ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయం సైతం ఈ రాష్ట్రంలోనే ఉంది. అందుకే మహారాష్ట్ర చేజారిపోకుండా ఎన్నికల ప్రకటనలో జాప్యం సహా అన్ని పాచికలనూ బీజేపీ వాడింది. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించిన విపక్ష ఎంవీఏ చివరి వరకు అతి విశ్వాసంలోనే ఉంది. సీట్ల సర్దుబాట్లలో అసంతృప్తులు, పార్టీల ఆధిపత్య ధోరణి ఎంవీఏను ఘోరంగా దెబ్బతీసింది. జార్ఖండ్‌లో బీజేపీ కుయుక్తులను జేఎంఎం కూటమి సమర్ధవంతంగా ఎదుర్కొని విజయ తీరాలు చేరింది. మహారాష్ట్రలో మోడీ చరిష్మా పని చేసిందని ఊరేగుతున్న బీజేపీకి జార్ఖండ్‌లో అదేమైందో విశదీకరిస్తే బాగుంటుంది. గిరిజన రాష్ట్రమైన జార్ఖండ్‌లో సహజ వనరులను అదానీ, ఇతర కార్పొరేట్లకు ధారాదత్తం చేయాలన్న బిజెపి పన్నాగం పారలేదు. వయనాడ్‌లో ప్రియాంక గెలుపు ఊహించినదే. దేశ వ్యాప్తంగా ఉప ఎన్నికలు జరిగిన 46 అసెంబ్లీ స్థానాల్లో అత్యధికంగా అధికార కూటములు, పార్టీలు నెగ్గాయి. మహారాష్ట్రలో దహాను స్థానంలో సీపీఐ(ఎం) జయకేతనం వామపక్ష, ఆదివాసీ హక్కుల, కార్మిక, ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తినిస్తుంది. సార్వత్రిక ఎన్నికల్లో స్వంతంగా మెజార్టీ కోల్పోయి కేంద్రంలో సంకీర్ణ సర్కారు నడుపుతున్న బీజేపీకి హర్యానా, మహారాష్ట్ర గెలుపులు ఊతమిస్తున్నాయి. గడిచిన రెండు దశాబ్దాల ఎన్నికల సరళిని పరిశీలిస్తే ఈ దేశంలో ఏకపార్టీ అధికారంలోకి వచ్చే సూచనలు తగ్గాయని అర్థమవుతుంది. ఇప్పుడు బీజేపీ పుణ్యమాని రాష్ట్రాల్లో కూడా సంకీర్ణ ప్రభుత్వాలే వస్తున్నాయి. మొన్న ఆంధ్రప్రదేశ్, నేడు మహారాష్ట్ర ఇందుకు సాక్ష్యాలు.



## బీచ్‌లో పల్లీబఠాణీ అమ్మిన తొలి సంపాదన..

పదీపన్నెండేళ్లుగా మీడియా కొన్ని వేల స్ఫూర్తిదాయక కథనాలు రాసింది ఆమె జీవితం గురించి..! ఒక్కసారి ఆ కథేమిటో నెమరేసుకుందాం.. "పట్రీసియా.. ఆమెది చెన్నై.. సంప్రదాయిక క్రిస్టియన్ కుటుంబం. పదిహేడేళ్ల వయస్సులోనే నారాయణ్ అనే ఓ బ్రాహ్మణ యువకుడిని పెళ్లి చేసుకుంది. కుటుంబాన్ని ఎదిరించింది. భర్తతో కలిసి నడిచింది. తరువాత నారాయణ్ తాగుడుకు అలవాటు పడ్డాడు, ఏం తినాలో, ఎలా బతకాలో అర్థం కాని దురవస్థ.. ఆత్మహత్య చేసుకుందామని సముద్రం వైపు నడుస్తూ, మెరీనా బీచ్‌లో పల్లీలు, బఠాణీలు అమ్మేవాళ్లను చూసి ఇంతమంది ఈ చిన్నపనితో బతుకుతున్నారు, నేనెందుకు బతకలేను అనుకుని, ఇంటికి వాపస్ వచ్చేస్తుంది. మరుసటి రోజు నుంచి తనూ పల్లీబఠాణీలు అమ్మడం స్టార్ట్ చేస్తుంది. తొలిరోజు ఆమె సంపాదన ఆరాణా.. యాభై పైసలు.. నిరాశపడలేదు. ఆదాయం పెరిగింది, మొదట ఓ టీకొట్టు, తరువాత ఓ హొటల్.. మరికొన్ని హొటళ్లు, కార్పొరేట్ ఆఫీసుల క్యాంటీన్లు.. మెరీనా బీచ్‌లో ఎంబీఏ చదువుకున్నాను, అదే చదువు నేర్పింది అని నవ్వుతూ చెప్పే ఆమెకు ఇప్పుడు కోట్లల్లో ఆస్తులు.. 2010లో ఫిక్కీ బెస్ట్ వుమన్ ఎంటర్‌ప్రెనూర్ అవార్డు ఇచ్చింది ఆమెకు.. ప్రస్తుతం సాందీఫా చెయిన్ ఆఫ్ హొటల్స్ నడిపిస్తోంది. నిజంగా ఓ ఇన్‌స్పైరింగ్ స్టోరీ..

# అర్ధరూపాయి.. ఆ తర్వాత..?

చప్పట్లు కొట్టి అభినందించాల్సిన కథ.. ఈ కథ చదివి పదిమంది సక్సెస్ సాధించినా ఆమె బతుకు సార్థకమయ్యే కథ.. అయితే..? ఎప్పుడూ నాణేనికి మరో పార్శ్వం ఉంటుంది. ఇది వెలుగైతే అది చీకటి..

నిజానికి ఇన్నికథలు రాశారు గానీ ఆమె బీచ్‌లో పల్లీబఠాణీలు అమ్మలేదు. ఇంట్లోనే పచ్చళ్లు, జామ్‌లు తయారు చేసి అమ్మేది. తరువాత బీచ్‌లో ఓ కియోస్క్ పెట్టడానికి పర్మిషన్ కోసం ఏడాదిపాటు తిరిగింది. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అలా తిప్పింది ఆమెను..

కియోస్క్ ఓపెన్ చేశాక చాయ్, కాఫీ, సమోసాలతో వ్యాపారం స్టార్ట్ చేసింది. ఆమెకు వ్యాపారంలో కిటుకులు ఏమిటో అర్థమయ్యాయి. క్రమేపీ వ్యాపారం పెంచుతూ పోయింది. ఆమె వ్యాపారం స్టార్ట్ చేసింది 1982లో.. ఇక్కడ కొన్ని ప్రశ్నలు..

ఆమె నిజంగానే పల్లీబఠాణీలు అమ్మడంతో స్టార్ట్ చేసిందనో, పచ్చళ్లతో వ్యాపారం మొదలుపెట్టిందనో అనుకుందాం. ఆరోజు నుంచి ఈరోజు దాకా అదే బీచులో పల్లీబఠాణీలు అమ్మేవాళ్లు వందల్లో ఉన్నారు. ఆమెకన్నా తెలివైనవాళ్లు, ఆమెకన్నా కష్టపడేవాళ్లు.. కానీ ఆమె మాత్రమే ఎందుకు సక్సెసైంది..? ఈరోజుకూ ఇంటి నుంచి పచ్చళ్లు సప్లయ్ చేసేవాళ్లు బోలెడు మంది, మరి ఈమే ఎందుకు సక్సెసైంది..?

ఆమె జీవితమంతా వెలుగేమీ కాదు. ఆమె ప్రేమవివాహం ఓ డిజాస్టర్.. బాధ్యత లేని ఆ భర్త ఆమెకు నరకం చూపించాడు. ఆమెను కొట్టి మరీ డబ్బు లాక్కుపోయేవాడు, నెలల తరబడీ ఇంటి మొహం చూసేవాడు కాదు. తిరిగీ తిరిగీ తాగీ తాగీ ఓరోజు హరీమన్నాడు. అదొక ఫెయిల్యూర్ స్టోరీ.. తెలిసీతెలియని వయస్సులో తీసుకున్న అతి పెద్ద చెత్తా నిర్ణయం అని ఆమే చెప్పుకుంది.

బిడ్డ ప్రేమపెళ్లి యవ్వారం చూశాక మళ్లీ ఆమెను తల్లిదండ్రులే చేరదీశారు, సాయం చేశారు. తల్లి ఏరోజుకారోజు ఆమెను మోటివేట్ చేస్తూ బతుకుపై ఆశను నింపింది. తండ్రి స్నేహితుడే ఓ కియోస్క్ చూపించి, మెరీనా బీచ్ సజెస్ట్ చేశాడు.

బాగా కుదురుకునే దశలో కూతురు, అల్లుడు ఒకేసారి ఓ ప్రమాదంలో మరణించారు. ఆ దుఃఖాన్ని మరిచిపోవడానికి, మరింత పని కల్పించుకోవడం కోసం హొటళ్లను విస్తరించుకుంటూపోయింది. సో.. చీకట్లు కమ్మేసినప్పుడు నిరాశలో కూరుకుపోకుండా నిలబడి బతుకుతో పోరాడాలి అని చెప్పే కోణంలో ఈమె కథ గుడ్.. కానీ ఆమెకు కొన్ని పర్సనల్, ఫ్యామిలీ అంశాల్లో దురదృష్టం తీవ్ర నష్టం కలిగించింది. వ్యాపారంలో మాత్రం అదృష్టం కరుణించింది. అంటే డెస్టినీ..

ఎస్, ఆమె బతుకులో వెలుగూనీడల్ని నిర్దేశించింది అదే.. ప్రతి సక్సెస్ స్టోరీలో అంతర్లీనంగా కొన్ని ఫెయిల్యూర్లు కూడా ఉంటయ్.. రీసెంటుగా మళ్లీ సోషల్ మీడియాలో ఆమె విజయగాథ సర్క్యులేట్ అవుతుంటే నిజంగానే బీచులో పల్లీబఠాణీల అమ్మకం నుంచి వందల కోట్ల ఆస్తుల దాకా ఎదగడం కరెక్టేనా అని వెనక్కి తవ్వుకుంటూ పోతే తెలిసిన వివరాలు ఇవీ!!

– ముచ్చట సౌజన్యంతో..



**క్యారెక్టర్ ఆర్టిస్టుగా ప్రయాణం మొదలుపెట్టి హీరోగా ఎదిగిన టాలెంటెడ్ యాక్టర్ సత్యదేవ్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం.. జీబ్రా. తెలుగు నుంచి సునీల్-సత్య.. కన్నడ నుంచి డాలీ ధనంజయ.. తమిళం నుంచి ప్రియ భవానీ శంకర్-సత్యరాజ్.. ఇలా సకల భాషల సమ్మేళనంగా తెరకెక్కిన ఈ థ్రిల్లర్ మూవీ ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి.**

**నటీనటులు:** సూర్య పాత్రలో సత్యదేవ్ చాలా సిన్సియర్‌గా నటించాడు. ఆరంభం నుంచి చివరి వరకు తన పాత్రలో.. నటనలో ఒక ఇంటెన్సిటీ కనిపిస్తుంది. తన లుక్.. బాడీ లాంగ్వేజ్ పాత్రకు బాగా సరిపోయాయి. ఆద్యంతం ప్రేక్షకులను ఎంగేజ్ చేసేలా నటించాడు సత్యదేవ్. హీరోయిన్ ప్రియ భవానీ శంకర్ ఓకే. హీరో కాని హీరో పాత్రలో డాలీ ధనంజయ ఆకట్టుకున్నాడు. తన స్క్రీన్ ప్రెజెన్స్ బాగుంది. వాయిస్ తనకు అసెట్. కానీ ఆ పాత్రకు విపరీతమైన బిల్డప్ ఇచ్చి ప్రేక్షకులను విసిగించారు. సత్యరాజ్ కొంచెం క్రేజీగా అనిపించే పాత్రలో కాసేపు ఎంగేజ్ చేశాడు. సీరియస్ గా సాగే సినిమాలో సత్య కామెడీ పెద్ద రిలీఫ్. 'మత్తు వదలరా-2' ఫామ్ ను కొనసాగిస్తూ అతను కనిపించిన ప్రతిసారీ నవ్వించాడు. సునీల్ వెరైటీ పాత్రలో కొత్తగా కనిపించాడు. తన లుక్.. మేనరిజమ్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. గరుడ రామ్ చివర్లో వచ్చి కాసేపు మెరిశాడు. మిగతా ఆర్టిస్టులంతా ఓకే.

**కథనం-విశ్లేషణ:**

ఏదైనా ఒక జానర్లో ఒక బెంచ్ మార్క్ లాంటి సినిమా వచ్చాక.. మళ్లీ అలాంటి కథలతో సినిమాలు వస్తే ప్రేక్షకుల అంచనాలను అందుకోవడం కష్టం. ముందు వచ్చిన సినిమాతో పోల్చి చూసి.. కంటెంట్ ఏమాత్రం తగ్గినా ఆడియన్స్ పెదవి విరుస్తారు. బ్యాంకింగ్ వ్యవస్థలో లొసుగులను ఔపోసన పట్టిన హీరో.. ఆ నైపుణ్యంతో ఆడే ఆట నేపథ్యంలో ఇటీవలే 'లక్కీ భాస్కర్' అనే సినిమా ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. యాదృచ్ఛికంగా ఈ సినిమా తెరకెక్కిన సమయంలోనే రూపొందిన 'జీబ్రా'లోనూ ఆ కథ ఛాయలు చాలా కనిపిస్తాయి. ఇందులో కూడా హీరో బ్యాంకు ఉద్యోగే. అతనూ బ్యాంకింగ్ సిస్టంలో లోపాల్ని ఉపయోగించుకుని పెద్ద గేమ్ ఆడతాడు. ఈ క్రమంలో పావులా మారతాడు. పెద్ద సమస్య అతణ్ని చుట్టుముడుతుంది. దాన్నుంచి అతనెలా బయటపడ్డాడనే నేపథ్యంలో కథ నడుస్తుంది. ఐతే కథపరంగానే కాక సన్ని వేశాల్లోనూ 'లక్కీ భాస్కర్'తో పోలిక కనిపించే 'జీబ్రా' దానికి దరిదాపుల్లో కూడా నిలవలేక పోయింది. ఏదో చెప్పాలని.. ఏదేదో చేసే యాలని చాలా పాత్రలు పెట్టేసి..అనేక లేయర్లుండేలా కథను తయారు చేసుకున్నారు కానీ.. ఆ కథను కుదురుగా చెప్పడంలో ఫెయిలవడంతో 'జీబ్రా' ఎంగేజ్ చేయలేకపోయింది.

'జీబ్రా'లో సత్యదేవ్ హీరోనే కానీ.. కథంతా అతడి మీదే నడవదు. దానికి సమానమైన చాలా పాత్రలు ఇందులో కనిపిస్తాయి. 'పుష్ప' ఫేమ్ డాలీ ధనంజయకు హీరోను మించిన ఎలివేషన్ ఇచ్చారు. సునీల్ వెరైటీ గెటప్-క్యారెక్టర్లో కనిపించిన ప్రతిసారీ ప్రేక్షకుల అటెన్షన్ రాబడతాడు. 'మత్తు వదలరా-2'తో మెరుపులు మెరిపించిన సత్య తనదైన శైలిలో నవ్వులు పంచుతాడు. సత్యరాజ్ క్యామియో తరహా పాత్రలో బాగానే మెరిశాడు. ఇలా ప్రాధాన్యం ఉన్న పాత్రలు ఎక్కువ కనిపిస్తాయి కానీ.. ఆయా పాత్రలను ఎలివేట్ చేసే క్రమంలో కథ పక్కదారి పట్టేసింది. ఆరంభం హడావుడిగా.. గజిబిజిగా సాగే నరేషన్.. లాజిక్ కు అందకుండా కన్వీనియెంట్‌గా సాగిపోయే సన్నివేశాలు ప్రేక్షకులకు విసుగు తెప్పిస్తాయి. కథ పరుగులు పెడుతుంటుంది కానీ.. దాన్ని క్యాచ్ చేయడంలో మాత్రం ప్రేక్షకులు ఇబ్బంది పడతారు. డాలీ ధనంజయ పాత్రను తీర్చిదిద్దిన విధానం చూస్తే అసలీ పాత్ర ద్వారా దర్శకుడు ఏం చెప్పాలనుకున్నాడన్నది అర్థం కాదు. ఓవైపు వందల కోట్ల డీల్స్ చేసే అతను.. ఐదు కోట్ల కోసం పట్టుబట్టి కూర్చోవడం సరైన లాజిక్ కనిపించదు. తన బ్యాక్ స్టోరీ అంతా కూడా ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెడుతుంది.

'జీబ్రా' కథలో అనేక లేయర్లు కనిపిస్తాయి. అంత సులువుగా అర్థం అయ్యే కథ కాదిది. చివరికి వచ్చే వరకు ప్రేక్షకులను ఒక గందరగోళంలోనే ఉంచేలా కొంచెం గజిబిజిగా కథను నరేట్ చేశాడు దర్శకుడు. కొన్ని పాత్రలు.. సీన్లు చూస్తే అసలీ కథతో ఏం చెప్పదలుచుకున్నారనే అయోమయం కలుగుతుంది. చివర్లో కొంచెం కథను రక్తి కట్టించే ప్రయత్నం జరిగింది కానీ.. అంతకుముందున్న గందరగోళాన్ని మరిపించే స్థాయిలో మాత్రం లేదు. బ్యాంకింగ్ సిస్టంలో లొసుగుల్ని ఉపయోగించుకుని హీరో గేమ్ ఆడే సీన్లు ప్రేక్షకులను కొంత ఎంగేజ్ చేస్తాయి. ఐతే అవి థ్రిల్లింగ్‌గా అనిపించినప్పటికీ.. లూజ్ ఎండ్స్‌తో వదిలేయడం వల్ల లాజికల్‌గా అనిపించవు. బ్యాంకులో అందరినీ బురిడీ కొట్టించి రెండున్నర కోట్లు కొట్టేసే ఎపిసోడ్ ఒకటి సినిమాలో ఇంట్రెస్టింగ్‌గా అనిపిస్తుంది. కాకపోతే ఆ ఎపిసోడ్ కూడా చాలా కన్వీనియెంట్‌గా సాగిపోతున్నట్లు అనిపిస్తుంది. వేరే సీన్లు కూడా ఇలాగే తయారయ్యాయి. 'లక్కీ భాస్కర్' చూసిన వాళ్లు అందులోని సన్నివేశాలతో వీటిని పోల్చుకుని కచ్చితంగా పెదవి విరుస్తారు. సినిమాలో ప్రతి పాత్రా ఒక గేమ్ ఆడుతూ ఉంటుంది. కానీ ఎవరి గేమ్ ఏంటో అర్థం చేసుకోవడమే కష్టమవుతుంది. హీరో పాత్రకు సరైన లక్ష్యాన్ని నిర్దేశించడంలో దర్శకుడు ఫెయిలయ్యాడు. తన పాత్ర ఒక్కోసారి ఒక్కోరకంగా ప్రవర్తిస్తూ ఉంటుంది. కథలో మలుపులకు లోటు లేదు కానీ.. ఆ మలుపులు లాజికల్‌గా అనిపించవు. థ్రిల్లర్ సినిమాను రెండు ముప్పావు గంటల నిడివితో తీయడం పెద్ద మైనస్. అవసరం లేని సీన్లు చాలా ఉన్నాయిందులో. అక్కడక్కడా కొన్ని సీన్ల వరకు ఓకే అనిపించినా.. ఓవరాల్ గా 'జీబ్రా' మెప్పించలేకపోయింది.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...

**కథ:**

సూర్య (సత్యదేవ్) బ్యాంక్ ఆఫ్ ట్రస్ట్ అనే బ్యాంకులో ఉద్యోగి. బ్యాంకింగ్ సిస్టంలో లొసుగులన్నీ తెలిసిన అతను.. ఏదైనా సమస్య వచ్చినపుడు ఆ లొసుగుల్ని వాడుకుని దాన్నుంచి బయటపడుతుంటాడు. అతను ప్రేమించిన అమ్మాయి స్వాతి (ప్రియ భవాని శంకర్) కూడా మరో బ్యాంకులో ఉద్యోగే. ఆమె చేసిన ఒక పొరపాటు వల్ల 4 లక్షల రూపాయలు వేరే అకౌంటుకి వెళ్లిపోతే.. సూర్య తన స్టయిల్లో ఆ 4 లక్షలు వెనక్కి వచ్చేలా చేస్తాడు. కానీ సూర్య తొక్కిన అడ్డదారి తనకు చాలా పెద్ద సమస్యే తెచ్చి పెడుతుంది. చాలా ప్రమాదకరమైన మాఫియా డాన్ అయిన ఆది (డాలీ ధనంజయ)కు 5 కోట్ల రూపాయలు కట్టాల్సిన స్థితిలో పడతాడు సూర్య. నాలుగు రోజుల్లో ఆ డబ్బులు కట్టకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని అర్థమవడంతో ఆ డబ్బులు సంపాదించే పనిలో పడతాడు. కానీ ఈ క్రమంలో అతను ఇంకా ఇంకా సమస్యల్లో కూరుకుపోతాడు. ఇంతకీ ఈ ఐదు కోట్ల గొడవేంటి.. సూర్యను చిక్కుల్లో పడేసిందెవరు.. దీన్నుంచి అతను ఎలా బయటపడ్డాడు అన్నది మిగతా కథ.

**సాంకేతికవర్గం:** 'జీబ్రా'కు సాంకేతిక హంగులు బాగానే కుదిరాయి. రవి బస్రూర్ నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణ. ఏరి కోరి అతణ్ని పెట్టుకున్నందుకు అతను బాగానే న్యాయం చేశాడు. సినిమా రేసీగా అనిపించేలా బ్యాగ్రౌండ్ స్కోర్ మంచి ఫ్లోతో సాగుతుంది. పాటలకు ఇందులో ప్రాధాన్యం లేదు. సత్య పొన్మార్ ఛాయాగ్రహణం బాగుంది. సినిమాలో మంచి క్వాలిటీ కనిపిస్తుంది. సత్యదేవ్ హీరోగా నటించిన మరే చిత్రంలో ఈ స్థాయి నిర్మాణ విలువలు కనిపించవు. రైటర్ కమ్ డైరెక్టర్ ఈశ్వర్ కార్తీక్.. యువ-మీరాఖ్ లతో కలిసి అందించిన కథలో విషయం ఉంది. అంత తేలిగ్గా చెప్పగలిగే కథ కాదు ఇది. కానీ దీన్ని నరేట్ చేయడంలో కార్తీక్ తడబడ్డాడు. ప్రేక్షకులను తీవ్ర గందరగోళానికి గురి చేశాడు. అక్కడక్కడా కొన్ని సీన్లలో మినహాయిస్తే అతను మెప్పించలేకపోయాడు.




# గజిబిజి కథలో కొన్ని మెరుపులు!

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



(సత్యంన్యూస్, నరసన్నపేట)

జలుమూరు మండలం చల్లవానిపేట పీఏసీఎస్ కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే రైతుల ఖాతాల్లో డబ్బులు 48 గంటల్లో జమ చేస్తామని తెలిపారు. పల్లెల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు తాము ఎప్పుడు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెలమల చంద్ర భూషణ్, సర్పంచులు దుంగ స్వామిబాబు, బగ్గు గోవిందరావు, మంచిరెడ్డి రామచంద్రరావు, బోడాల బాలకృష్ణ, తర్ర బలరాం, పొన్నాడ దాలయ్య, పట్ట ఉమామహేశ్వరరావు, గుండ మన్మధరావు, కోపరేటివ్ సొసైటీ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజ్యాంగం సామాన్యుల రక్షణ గోడ

(సత్యంన్యూస్, నరసన్నపేట)

రాజ్యాంగం అంటే స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావాలు మూల స్తంభాలుగా దేశ ప్రజల సర్వతోముఖాభివృద్ధిని కాంక్షించే సమున్నత ఆశయమని పద్మావతి కళాశాలల డైరక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాజ్యాంగం 75 ఏళ్లుగా సామాజిక, ఆర్థిక, లింగ భేదాలకు అతీతంగా దేశ ప్రజల జీవితాల్నీ ప్రభావితం చేస్తూనే ఉందని, పేద, ధనిక తేడా లేకుండా ఓటుహక్కు, భావప్రకటన స్వేచ్ఛ మన రాజ్యాంగం వల్ల వచ్చిందే అని తెలిపారు. దేశ ప్రజలను ఒక జాతిగా నిలిపి దేశంగా కలిపి ఉంచుతున్న రాజ్యాంగం ఒక రక్ష అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీఓ కె.రాము, తెలుగు అధ్యాపకులు లక్కోజు గౌరీశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



## కార్పొరేషన్‌లో విలీనం చేయొద్దు


**- అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో ఎమ్మెల్యేకు వినతి -**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కుశాలపురం, తోటపాలెం పంచాయతీలను శ్రీకాకుళం కార్పొరేషన్‌లో విలీనం చేయొద్దు, పంచాయతీలుగానే ఉంచాలని, తమ గ్రామానికి ఏ అభివృద్ధి కార్యక్రమాలు జరగడంలేదని స్థానికులు ఎమ్మెల్యే గొండు శంకరరావు, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావులకు విన్నవించారు. పీఎన్ కాలనీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వారు మంగళవారం శంకుస్థాపన అనంతరం స్థానికులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. గత నాలుగేళ్లుగా ఉపాధి పనులు లేక పేద, మధ్యతరగతివారు చాలా ఇబ్బంది పడుతున్నారని, ఇంటి పన్నులు కూడ కట్టలేమని వివరించారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో బీజేపీ నాయకులు పైడి రాజారావు, పైడి వేణుగోపాలంతో పాటు సాంబమూర్తి తదితరులు ఉన్నారు.

## రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుచేస్తున్న ఘనత బాబుదే



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని వైకాపా ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక జగనన్న ప్రజా కార్యాలయం వద్ద అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రజా పద్దుల కమిటీ చైర్మన్‌గా స్వపక్ష నేతనే చేస్తే నిజాయితీగా రాసే అవకాశం ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి కేవలం వైకాపాను, జగన్మోహన్ రెడ్డి భూస్థాపితం చేయాలనే రెడ్‌బుక్ రాజ్యాంగం చేస్తుందని అన్నారు. రాజ్యాంగం ఎంత గొప్పదో దానిని పరిశీలిస్తున్న ప్రజలు సరైన సమయంలో చంద్రబాబుకి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రజలు సోషల్ మీడియాలో బావ ప్రకటన చేస్తే రాజ్యాంగ విరుద్ధంగా అనేకమైన కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజ్యాంగ స్ఫూర్తిప్రదాత అంబేద్కర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతి భారతీయుడు దేశ రాజ్యాంగం గూర్చి పరిపూర్ణ అవగాహన కలిగివుండాలని, ప్రతిఒక్కరూ తన బాధ్యతలను నిర్వహిస్తూ రాజ్యాంగ బద్ధంగా హక్కులను పొందుతూ దేశాన్ని గౌరవిస్తూ, దేశ ఔన్నత్యాన్ని తెలియజేసే కార్యక్రమాల్లో పాల్గొనాలని శర్వాణి విద్యాసంస్థల అధినేత అంధవరపు సూరిబాబు అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలోనే నవంబరు 26, జనవరి 26 భారతీయులందరూ గుర్తుపెట్టుకోవలసిన ప్రముఖమైన రోజులని అన్నారు. ఎంతోమంది త్యాగధనుల రాజ్యాంగ ఫలితాలను అనుభవిస్తున్నామని, ఉభయ సభలైన రాజ్యసభ, లోక్‌సభలలో భారత రాజ్యాంగ దినోత్సవం చేయడానికి ఢిల్లీలో ఏర్పాటు చేసిన విషయాన్ని తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ కె.రేఖ మాట్లాడుతూ భారత రాజ్యాంగం అంటే కేవలం పరిపాలనకు సంబంధించిన నియమాలు, నియామకాలు, సూత్రాలు కాదని, సమానత్వం, స్వేచ్ఛ, సోదర భావాలు మూలస్థంభాలుగా దేశ ప్రజల అభ్యున్నతికి, విభిన్న భాషలు, మతాలు, ఆచారాలు, సంప్రదాయాలు కలిగిన భారతావనిని సంఘటితంగా సామరస్యం, సస్య శ్యామలంగా ఉండే ధ్యేయంతో రచించినదని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

## కాకినాడ శ్రీ ఆదిత్యలో రాజ్యాంగ దినోత్సవం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆర్ట్స్ కాలేజీ రోడ్డులోని కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా నెహ్రూ యువ కేంద్ర, కాకినాడ శ్రీఆదిత్య సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ఏవోఆర్, జిల్లా న్యాయవాది ఎ.శ్రీనివాసులు, ఉమామహేశ్వరరావు, జిల్లా యూత్ ఆఫీసర్ కెవి ఉజ్వల్, సీఈవో బీవీ ప్రసాదరావు (సెట్‌శ్రీ), జిల్లా టూరిజం ఆఫీసర్ ఎన్.నారాయణరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీ వేణుగోపాల్, ఎన్ఎస్ఎస్ పీవో ఎం.నాగభూషణరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ దేశ ప్రజల హక్కులను కాపాడడంలో, ప్రభుత్వ విధానాన్ని సక్రమంగా నిర్వహించడంలో రాజ్యాంగం పాత్ర ఎంతగానో ఉందన్నారు. పటిష్టమైన విధానంలో ఎన్నో దేశాలకు భారత రాజ్యాంగం ఆదర్శంగా నిలచిందన్నారు. ప్రముఖ న్యాయవాది ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలోనే ఎంతో గుర్తింపుని సంపాదించిందన్నారు. జిల్లా యూత్ ఆఫీసర్ ఉజ్వల్ మాట్లాడుతూ యువత ఉత్సాహంగా అన్నీ కార్యక్రమాల్లో ముందుండాలనీ, ఆదిత్య విద్యార్థులు అన్నింటా ముందుండటం అభినందనీయమన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ముఖ్య అతిధులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



గొంటివీధిలోని నిరాశ్రయుల వసతిగృహంలో నిరుపేదలు, స్థానికులకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో అధ్యక్షులు లైన్ డాక్టర్ బొడ్డేపల్లి మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ పొన్నాడ రవి, సన్‌రైజ్ హాస్పిటల్ వైద్య సిబ్బంది, లైన్స్ క్లబ్ సెంట్రల్ కోశాధికారి జోగి భారతి, సభ్యులు టెక్కం రామ్‌గోపాల్, గుత్తు చిన్నారావు, జోగి రాజు, షెల్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు. నైట్ షెల్టర్‌లో ఉండేవారితో పాటు, వైద్యపరీక్షలు చేయించుకున్నవారికి అల్పాహారాన్ని అందించారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెడదాం

**- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గురుగుబెల్లి -**



(సత్యంన్యూస్, లావేరు)

భారత రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెడదామని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గురుగుబెల్లి దామోదరరావు పిలుపునిచ్చారు. ఇజ్జాడపాలెం మండల ప్రాథమికోన్నతలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం జరుపుకున్నారు, ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దామోదరరావు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని 1946లో 399 మందితో ఏర్పడిన రాజ్యాంగ పరిషత్ దేశ విభజన కారణంగా 285 మంది రాజ్యాంగ పరిషత్‌లో భారత దేశానికి ప్రాతినిధ్యం వహించి, రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు శ్రమించి వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి, అత్యున్నత లిఖిత రాజ్యాంగాన్ని రూపొందించుకున్నామని తెలిపారు. ఇందిరా మాట్లాడుతూ వయోజనులందరికీ ఓటు హక్కు కల్పించటం, దళిత, గిరిజన, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరచడం అభినందనీయమన్నారు. బి.మోహనరావు మాట్లాడుతూ రాజ్యాంగ నైతికతను పాటిస్తూ రాజకీయవేత్తలు, అధికార యంత్రాంగం, న్యాయాధికారులు రోల్ మోడల్‌గా ఉంటేనే భారతదేశం వికసించగలదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీలో సంవిధాన్ దివస్

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం ప్రాంగణం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నేషనల్ కన్‌స్టిట్యూషన్ (సంవిధాన్ దివాస్) ఘనంగా నిర్వహించారు. 1949లో భారత రాజ్యాంగం ఆమోదం పొందిన సందర్భంగా ప్రతి సంవత్సరం నవంబరు 26న జాతీయ సంవిధాన్ దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మంగళవారం ట్రిపుల్ ఐటీ నుంచి ఎచ్చెర్ల గ్రామం వరకు పాదయాత్ర చేశారు. భారత రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యతగా భావించండి అంటూ నినాదాలు చేశారు. అనంతరం ప్రాంగణంలో అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ మాట్లాడుతూ ఎందరో మహానుభావులు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగం, వారి సేవలను ప్రతి భారతీయ పౌరులు తెలుసుకుని భారత రాజ్యాంగం కాపాడుకోవాలని అన్నారు. డీన్ మోహన్ కృష్ణ చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక హక్కులు, విధులు తెలుసుకొని క్రమశిక్షణతో విద్యార్థి జీవితం గడపాలని సూచించారు. ఫైనాన్స్ ఆఫీసర్ వాసు మాట్లాడుతూ నేటి యువతరం ఆ సామాజిక అంశాలపై అవగాహన చేసుకొని రాజ్యాంగం గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ మోహన్‌రావు, జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ డాక్టర్ పెద్దింటి ముకుందరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వి.సింహాచలం, డాక్టర్ జి.ఈశ్వరరావు, టి.అసిరినాయుడు, ఆర్.పద్మావతి, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.





పాతశ్రీకాకుళం సంతోషిమాత అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి జన్మ నక్షత్రము స్వాతి నక్షత్రము సందర్భంగా ఈ నెల 29న ఉదయం సుప్రభాత సేవ, క్షీరాభిషేకం, కుంకుమపూజ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధానార్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

శ్రీకాకుళం రూరల్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాత్రునివలసలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు ఐ.డి.వి.ప్రసాద్ అధ్యక్షతన జరిగినది. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పాత్ర రాజ్యాంగ విశిష్టతను గురించి పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పంచిరెడ్డి అప్పలనాయుడు, గ్రామ పెద్దలు బాణాల బలరాంలు పాల్గొన్నారు.



## యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లాశాఖల్లో కొత్తూరు నేతలకు స్థానం

(సత్యంన్యూస్, కొత్తూరు)

ఈనెల 24, 25 తేదీలలో మందస-హరిపురంలో జరిగిన యుటీఏఫ్ 50 వసంతాల స్వర్ణోత్సవ మహాసభల్లో నూతన కార్యవర్గాల ఎంపిక జరిగింది. దీనిలో కొత్తూరుకు చెందిన సీనియర్ నాయకులు చోటు దక్కించుకున్నారు. దండు ప్రకాశరావును రాష్ట్ర కౌన్సిలర్‌గా, బోడ శ్రీనును జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తున్న వీరిని సంఘం గుర్తించిందని కొత్తూరు మండలం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.విజయకుమార్, మధుసూదన రావులు హర్షం వ్యక్తం చేశారు. కొత్తూరు మండలానికి జిల్లా, రాష్ట్ర సంఘం గుర్తింపు నివ్వడాన్ని మండలం కార్యవర్గ సభ్యులంతా హర్షం వ్యక్తం చేసారు.







ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# 'విజయ్'తిలకం.. సిక్కోలుకు అద్దింది క్రికెట్ సంఘం

**అది 2023.. కనీసం జోనల్ స్థాయి క్రికెట్‌కు కూడా సెలక్ట్ కాని ఆ కుర్రాడి కోసం జిల్లా క్రికెట్ సంఘం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌తో ఒక యుద్ధమే చేసింది. 2019లో అండర్-19కు ఆడి 26 వికెట్లు తీసి, తన బ్యాట్‌తోనూ టీమ్‌ను గెలిపించిన ఆ కుర్రాడ్ని జోన్ గేమ్స్‌లో కూడా సెలక్ట్ చేయకపోవడంతో జిల్లా క్రికెట్ సంఘం స్థాయికి మించి పోరాడింది. ఎందుకంటే.. అప్పటికే నాలుగేళ్లుగా నిలకడగా రాణిస్తూ ప్రతీసారి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న టీమ్‌ను విజయతీరాలు చేర్చిన వ్యక్తి కోసం చేసిన పోరాటం ఫలించింది. దాని పర్యవసానమే 2023లో జోనల్ పోటీల్లో ఆడి, ఆ తర్వాత రాష్ట్రస్థాయిలో తన సత్తా చాటి, రంజీల్లో తన తర్వాతే ఎవరైనా అని నిరూపించిన ఆ కుర్రాడే ఇప్పుడు జిల్లా చరిత్రలో మొదటిసారిగా ఐపీఎల్‌లో ఆడటానికి స్థానం దక్కించుకున్నాడు.**





- గ్రౌండ్‌లు లేని జిల్లా నుంచి ఐపీఎల్‌కు వెళ్లిన త్రిపురాన
- కష్టనష్టాలకోర్చి భవిష్యత్తును తీర్చిదిద్దిన మెంటార్లు
- ఐపీఎల్‌లో రూ.30లక్షలకు కొనుగోలుచేసిన ఢిల్లీ కేపిటల్స్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఢిల్లీ కేపిటల్స్ తరపున ఐపీఎల్‌లో ఆడనున్న త్రిపురాన విజయ్ సక్సెస్ వెనుక జిల్లా క్రికెట్ సంఘం, కోచ్‌లు, మెంటార్‌లు చేసిన కృషి ఒక్కసారి గుర్తుచేసుకోవాలి. టెక్కలికి చెందిన డిగ్రీ ఫస్టియర్ విద్యార్థి త్రిపురాన విజయ్‌ను ఐపీఎల్‌లో ఢిల్లీ కేపిటల్స్ ఫ్రాంచైజీ రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. ఇది జిల్లా చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ విజయం. అయితే ఈ యువకుడు ఎప్పటికైనా దేశం తరపున ఆడతాడన్న నమ్మకం మొదట కలిగింది జిల్లా క్రికెట్ సంఘానికే. జిల్లాలో క్రికెట్ పడుతూ, లేస్తూ ఉన్న రోజుల్లో రాజకీయ కబంధ హస్తాల్లో నలిగిపోతున్న సమయంలో విజయ్ లాంటి ఒక ప్లేయర్‌ను తయారుచేసి ఐపీఎల్‌కు పంపడమంటే చిన్న విషయం కాదు. స్టేడియం లేని శ్రీకాకుళం వంటి ప్రాంతం నుంచి ఒక క్రీడాకారుడు ఐపీఎల్‌కు వెళ్లడం కంటే వ్యక్తిత్వ వికాస పాఠం ఇంకేముంటుంది? జిల్లా క్రికెట్ సంఘంపై ఆధిపత్యానికి కోర్టుల్లో సుదీర్ఘ కాలం కేసు నడిచిన తర్వాత ఏడేళ్లు కిందా మీదా పడిన తర్వాత 2023 ఏప్రిల్‌లో అంబుడ్స్‌మన్ ద్వారా ప్రస్తుతం ఉన్న క్రికెట్ సంఘం చేతికి పగ్గాలు వచ్చాయి. కానీ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నుంచి 2024 ఏప్రిల్ వరకు ఎటువంటి నిధులు ఇక్కడికి విడుదల కాలేదు. కానీ జిల్లాలో క్రికెట్టే శ్వాసగా బతుకుతున్న అనేకమంది క్రీడాకారులు ఉన్నారని, వారి భవిష్యత్తు కోసం ఏదో చేయాలన్న తపనతో 2023లోనే జిల్లా క్రికెట్ సంఘం సీనియర్స్, అండర్ 23, అండర్19, అండర్16 కోసం ఎంపికలు నిర్వహించింది. వీరందరికీ ప్రాక్టీస్ ఇప్పించడం కోసం కళింగపట్నం, టెక్కలి తీసుకువెళ్లి ఆటలో మెళకువలు నేర్పించడానికి ఒక్కో సెలక్షన్‌కు రూ.1.25 లక్షలు ఖర్చవుతుంది. అప్పటికే ఏసీఏ నుంచి నిధులు రాకపోవడంతో జిల్లా క్రికెట్ సంఘంలో ట్రెజరర్‌గా ఉన్న మదీనా సైలానీ స్థానికంగా తన పలుకుబడిని ఉపయోగించి భోజనాలు, డ్రింకులు, అల్పాహారం వంటివి అప్పు చేసి, అరువు తెచ్చి నిధులు సమకూర్చేవారు. ఒకసారి టోర్నమెంట్‌కు ఎంపికలంటూ మొదలైతే 45 రోజుల ముందు ప్రోబబుల్స్‌ను తయారుచేసి, అందులో 40 మంది క్రీడాకారులను ఎంపిక చేసి, వారిలో వారికి పోటీ నిర్వహించి, అందులో టాప్ 25ను గుర్తించి, వారికి ఫిట్‌నెస్ క్యాంప్‌లో ఉంచి చివరిగా 18 లేదా 19 మందిని ఎంపిక చేస్తారు. వీటంతటికీ ఖర్చు ఎంతవుతుందో చెప్పనక్కర్లేదు. ఇలా ఎంపికైనవారిని జిల్లా నుంచి రాష్ట్రానికి ఆడిన బెస్ట్ ప్లేయర్స్‌తో శిక్షణ ఇప్పించారు. ఇందుకు మెంటార్లుగా ఇలియాస్ అహమ్మద్, కె.రవిచలం వ్యవహరిస్తూవచ్చారు. జిల్లా దాటితే అయ్యే ఖర్చులు భరించడంతో పాటు వీరందర్నీ రాష్ట్రస్థాయిలో బెస్ట్ ప్లేయర్లుగా తీర్చిదిద్దడం కోసం ఎక్కడెక్కడో ఉన్నా ఒక్కచోటకు చేరి శిక్షణను అందించారు. ఇందులో కె.రవిచలం స్వయానా ఒకప్పటి సినీహీరో, కమ్ కేరక్టర్ ఆర్టిస్ట్. చలంకు స్వయానా కొడుకు. ఎక్కడో ఉన్న ఈయన, మరెక్కడో ఉన్న జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పుల్లెల వై.ఎన్.శాస్త్రి, ఇలియాస్‌లు జిల్లా క్రికెట్ ప్లేయర్స్ మీదే శతశాతం దృష్టి సారించారు. దాని ఫలితమే ఇప్పుడు విజయ్ ఐపీఎల్‌కు ఎంపిక కావడం. అండర్ 23 రంజీ జట్టుకు విజయ్ వైస్‌కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. సోమవారం జరిగిన రంజీ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు వేసి 8 రన్‌లు ఇచ్చి, నాలుగు వికెట్లు తీసుకున్నాడు విజయ్. రాష్ట్రంలో ఎక్కడ ఎంపికలు జరిగినా, మన జిల్లా క్రీడాకారుల స్థానం పోకుండా జిల్లా క్రికెట్ సంఘం చూస్తూవస్తోంది. ఇక్కడ చీఫ్‌కోచ్ సుదర్శన్‌తో పాటు నలుగురు కోచ్‌లను టెక్కలి ఐతమ్ గ్రౌండ్స్, కళింగపట్నం గ్రౌండ్స్‌కు క్రీడాకారులతో పాటు తీసుకువెళ్లి శిక్షణ ఇప్పించడంతో విజయ్ లాంటివారు రాటుదేలారు. కేవలం ఈ జిల్లాలోనే ప్రాక్టీసు, శిక్షణ చేసి పక్కా లోకల్‌గా విజయ్ ఐపీఎల్‌లో అడుగుపెడుతున్నాడు. గతంలో ఉన్న క్రికెట్ సంఘం కార్యాలయంలోనే జాబితా తయారుచేసి గ్రౌండ్‌లోకి ప్లేయర్లను దించడం వల్ల ఇంతవరకు ఫలితాలు కనపడలేదు. ప్రతీ సెలక్షన్‌లోనూ 120 మంది క్రికెటర్ల నుంచి 19 మందిని ఎంపిక చేయడమే తలకుమించిన భారం. ప్రస్తుతానికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నుంచి నిధులు వస్తున్నా జిల్లాలో గ్రౌండ్లు లేకపోవడంతో స్థానిక ఆర్ట్స్ కళాశాల, ఉమెన్స్ కళాశాలలో మైదానాలను మెరుగుపర్చడానికి జిల్లా క్రికెట్ సంఘం ఒప్పందం కుదుర్చుకుంది. ఇది పూర్తయితే జిల్లా నుంచి ఎస్‌బీఎన్‌వీ ప్రసాద్, నంబాళ్ల సుశాంత్, మొదలవలస పూర్ణచంద్ర, జున్నారావు లాంటి అనేకమంది క్రికెటర్లు ఐపీఎల్‌కు వెళ్తారనే ఆశాభావం జిల్లా క్రికెట్ సంఘం వ్యక్తం చేస్తుంది.





జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు ఎడమ నుంచి పుల్లెల వై.ఎన్.శాస్త్రి, మదీనా సైలానీ, ప్రవీణ్, ఇలియాస్, రవిచలం

# మన్నం సతీష్ ఆల్‌టైమ్ రికార్డ్

(మొదటిపేజీ తరువాయి)

చేస్తూ గోనెపాడు ప్రభుత్వ పాఠశాల ప్రహరీ నిర్మాణ పనుల బిల్లు చెల్లించడానికి రూ.6వేలు లంచం డిమాండ్ చేసి రూ.5 వేలు తీసుకుంటుండగా ఏసీబీకి పట్టుబడి సస్పెండ్ అయ్యాడు.

ఇంత ట్రాక్ రికార్డు కలిగిన మన్నెం సతీష్ బాబుకు జిల్లా పరిషత్, పంచాయతీ శాఖ అధికారులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. ఈ సహకారంతోనే బాధితులకు సొమ్ము చెల్లించకుండా మంగువారితోటలోని ద్వారకానగర్‌లో మూడంతస్తుల భవనం కట్టుకున్నాడు. ఖరీదైన నాలుగు కార్లను మెయింటెయిన్ చేస్తూ పాతపట్నంలో ఒక అద్దెకొంపలో ఉంటూ అక్రమ కార్యకలాపాలను సాగిస్తున్నారు.

**నాలుగు సార్లు సస్పెండ్**

సతీష్ నిరుద్యోగుల నుంచి ఉద్యోగాల పేరుతో రూ.లక్షలు వసూలు చేసి కొంత మొత్తం జిల్లాపరిషత్, పంచాయతీ శాఖ అధికారులకు ముట్టజెప్పి పనిష్మెంట్ నుంచి ప్రతీసారి తప్పించుకుంటున్నారు. సతీష్ పని చేసిన టెక్కలి, సంతబొమ్మాళి, శ్రీకాకుళం, మందస, పలాస, కవిటి, వజ్రపుకొత్తూరు, సరుబుజ్జిలి, సంతకవిటి తదితర మండలాల్లో నిరుద్యోగులను టార్గెట్ చేసి రూ.కోట్లు వసూలు చేశాడు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా, బ్యాంకు మెసేంజర్లుగా, ట్రెజరీలో జూనియర్ సహాయకులుగా, ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ట్రాక్టర్లు, ఆటోలు, వాహనాలు, ఇళ్లు, ఇంటి స్థలాలు, హుద్‌హుద్ ఇళ్లు మంజూరు చేయిస్తానని ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.6 లక్షలు వసూలు చేశాడు. ప్రభుత్వ ఆసరా పింఛన్లు మంజూరు చేయిస్తానని డబ్బులు వసూలు చేసినట్టు సతీష్‌పై అభియోగాలు నమోదయ్యాయి. పలాస మండలం లొత్తూరులో సామాజిక భరోసా పింఛన్ల సొమ్ముతో పరారై ఆ తర్వాత కొన్ని రోజులకు విధుల్లో చేరాడు. 20 ఏళ్ల సర్వీసులో పదుల సంఖ్యలో ఫిర్యాదులు, నాలుగు సార్లు సస్పెన్షన్లకు గురైనా సతీష్ దర్జాగా ఉద్యోగం చూస్తూ నిరుద్యోగులను ఇప్పటికీ వంచిస్తున్నాడు. సతీష్ అక్రమాలను జిల్లాపరిషత్, పంచాయతీ శాఖలో అధికారులు పూర్తి సహకారం అందిస్తున్నారు. సతీష్ రోజుల తరబడి విధులకు హాజరుకాకపోయినా, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నా, సస్పెండ్‌కు గురవుతున్నా అయిన ఇచ్చే డబ్బులకు దాసోహం అవుతున్నారనే ఆరోపణలున్నాయి.

**నివేదిక ఇవ్వకుండా తాత్సారం**

జిల్లా పంచాయతీ అధివరికి సతీష్ బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో జూలై 20న మందస ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు విచారించారు. అదే నెలలో గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదుపై జెడ్పీ సీఈవోకు నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదుదార్లతో పాటు సతీష్‌ను జూలై 26న జెడ్పీలోని సీఈవో ఛాంబర్‌లో విచారించారు. అందరి నుంచి లిఖితపూర్వకంగా, మౌఖికంగా వాంగ్మూలాలు సేకరించారు. అదే సందర్భంలో కొందరు మహిళా బాధితులు సతీష్‌తో వాగ్వాదానికి దిగారు. విచారణ పూర్తి చేసి నివేదిక ఇస్తామని చెప్పిన సీఈవో నివేదిక కలెక్టర్‌కు ఇవ్వకుండా కాలయాపన చేశారు. దీనికి కారణం అప్పటి జెడ్పీ సీఈవో డబ్బులు తీసుకొని సతీష్‌ను కాపాడే ప్రయత్నం చేసి విచారణ నివేదిక ఇవ్వకుండా తొక్కిపెట్టారని బాధితులు ఆరోపిస్తున్నారు. అంతకు ముందు జూలై 11న ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాలతో శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద బాధితులను ఈ నెల 23న కార్యాలయానికి పిలిపించి విచారించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. విచారణలో కొందరు నిరుద్యోగుల నుంచి ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్నట్టు సతీష్ అంగీకరించారని తెలిసింది. సోమవారం గ్రీవెన్స్‌లో మరోమారు బాధితులంతా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తక్షణమే దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని మరోమారు డీపీవోను ఆదేశించారు. ఈ నెలాఖరున డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి ఫిర్యాదు చేయడానికి సిద్ధమయ్యారు.

## గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవం



(సత్యంన్యూస్, పాలకొండ)

భారత రాజ్యాంగ 75వ వసంతోత్సవం సందర్భంగా పాలకొండ శాఖా గ్రంథాలయంలో డాక్టర్ అంబేద్కర్ ఫోటోకి పూలమాల వేసి ఆయన సేవలను రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం కన్వీనర్ నూతలపాటి భరత్‌భూషణ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలోనే రాజ్యాంగాలన్నింటిని ఆకళింపు చేసుకొని, వాటిలో మనకు ఉపయోగపడే భావనలు తీసుకున్నారని, ఇలా మన సొంత ఆలోచనలకి ప్రపంచంలో అంశాలను కలిపించారని, కూటికి లేనివారు, కుబేరులు ఒకే వరుసలో నిల్చొని ఓటు వేస్తున్నారంటే, వివక్ష లేకుండా చదువుకోగలుగుతున్నారన్నా అది రాజ్యాంగం పుణ్యమే అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం జాతీయ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బత్తిన మోహన్, లుంబూరు సర్పంచ్, సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు తిర్లంగి ఉపేంద్ర, స్థానిక ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు పాఠకులు పాల్గొన్నారు.



ఖరీఫ్ సీజన్ (2024-25) ధాన్యం కొనుగోలులో భాగంగా వీరఘట్టం మండలం హుస్సేన్‌పురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీరఘట్టం మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, పాలకొండ

## నియోజకవర్గ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

- అర్హత ఉన్న ప్రతి పేదకు ఎన్టీఆర్ ఇల్లు
- అధికారులే ప్రజల దగ్గరకు వస్తారు
- అధికారులతో సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు



(సత్యంన్యూస్, టెక్కలి)

నూతన నివాసాల కోసం అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రతి పేదవారికీ పక్కా నివాసం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో రహదారులు, హౌసింగ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ అధికారులతో సమీక్షించారు. అర్హత ఉండి ఇప్పటి వరకు సొంత ఇల్లు లేనివారంతా నూతన ఇళ్ల కోసం అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న వెంటనే దానిని పరిశీలించి అధికారులు మీ దగ్గరకు వస్తారని తెలిపారు. అలాగే 2014-19 మధ్య మంజూరై ఆన్‌లైన్‌లో అర్హుల జాబితా లేని వాటిపై కూడా గుర్తించి వాటిని కూడా పరిష్కరించాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. టెక్కలిలో ఆదర్శ కాలనీ నిర్మాణానికి సంకల్పించామని, అన్ని వసతులతో ఉండే విధంగా చేపడతామన్నారు. గ్రామాల్లో బీటీ, సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణంతో పాటు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారుచేయాలని సూచించారు. ఇప్పటికే పల్లెపండగ పేరుతో గ్రామాల్లో మౌలిక సదుయాల కల్పనకు నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం పనులు జరుగుతున్నాయన్నారు. ప్రతి రైతుకి సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అచ్చెన్న తెలిపారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ అధికారులకు సూచించారు. ఎత్తిపోతల పథకాలు ద్వారా రైతులకు సాగునీరు పూర్తిస్థాయిలో అందచేద్దామని, ఏ ఏ ప్రాంతాల్లో పెండింగ్ ఉన్నాయో, వాటిని పూర్తిచేయాలని, వినియోగంలోకి తీసుకురావాలని, అవసరమైన నిధులు మంజూరు చేస్తామని అధికారులకు సూచించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో నిధులు మంజూరుచేసినా వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిపై నిర్లక్ష్యం చేసిందన్నారు. పాతపట్నం, గార ప్రాంతాల్లో కూడా గతంలో మంజూరు చేసామని, వాటిని కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం నియోజవర్గంలో జరుగుతున్న పనులు నాణ్యత ప్రమాణం పాటించాలని రహదారుల శాఖ అధికారులకు సూచించారు. ప్రస్తుతం 52 పనులకు గాను రూ.5కోట్లతో పనులు జరుగుతున్నాయని అధికారులు వివరించారు. రహదారుల నిర్మాణంతో పాటు, మరమ్మతులు కూడా చేయిస్తున్నట్టు వివరించారు. నిర్మాణ పనులపై ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందించాలని తెలిపారు. సమీక్షలో డిఈ, ఏఈ, పి.సత్యనారాయణ, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.